క్లుప్తంగా

ఉపాధిపనులపై నేటి నుంచి గ్రామ సభలు

నకరికల్లు: గత ఏడాది 2023-24లో చేపట్టిన ఉపాధి హామీ పనుల నాణ్యతపై సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజలు, కూలీల అభిప్రాయాలు సేకరించనున్నట్లు ఎస్ఆర్పీ ఎం.లోకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ.8.14 కోట్లు వెచ్చించి ఉపాధిపనులు చేపట్టారని వాటిలో కూలీలకు రూ.7.79 కోట్లు, మెటీరియల్‌కు రూ.34.51 లక్షలు వెచ్చించారన్నారు. చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహించేందుకు గాను మండలంలోని అన్ని గ్రామాల్లో ముందస్తుగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీన నర్శింగపాడు, 7న చీమలమర్రి, 8న కుంకలగుంట, అడ్డరోడ్డు, చేజర్ల గ్రామాల్లో, 9న రూపెనగుంట్ల, 10న గుండ్లపల్లి, నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో, 11వ తేదీన కండ్లకుంట, 12న బాలాజీనగర్‌తండా, దేచవరం, చాగల్లు, తురకపాలెం గ్రామాల్లో, 13న శివాపురంతండా, త్రిపురాపురం, జిల్లాపేటతండా గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు గ్రామ సభలకు హాజరై అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ముప్పాళ్ళ: మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో కార్తిక మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వేంచేసియున్న జగన్నాథస్వామి ఆలయంలోను, ముప్పాళ్ళలోని కాశీఅన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, లంకెలకూరపాడు, మాదల, నార్నెపాడు గ్రామాల్లోని శివాలయాల్లోనూ స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే ఆలయాలకు చేరి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పంటల రకాలపై రైతులకు అవగాహన



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల అగ్రికల్చర్ కాలేజీ విద్యార్థినులు చాగంటివారిపాలెం గ్రామ రైతులకు పంటల రకాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారులు, వనరులు, పంటలు, సమస్యలు, గ్రామ చరిత్ర మొబిలిటీ పటం అంశాలను రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఏయే పంటలు అధికంగా పండుతాయి. రాబడి గురించి రంగులతో బొమ్మలు వేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ శైలజ, ఎం.కవితారెడ్డి, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హిందీ ప్రవీణలో ప్రతిభ

గురజాల : దక్షిణ భారత హిందీ ప్రచార్ సభమద్రాస్ నందు గత నెలలో జరిగిన డి.బి.హెచ్.పి లో గురజాలకు చెందిన మట్టపల్లి మన్విత రియా మొదటి ర్యాంకు సాధించినట్లు హిందీ పండిట్ ఎం.రవికుమార్ తెలిపారు. గురజాలలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న ఎం.మన్విత రియా చిన్నతనంలోనే హిందీ భాషపై పట్టు సాధించినట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ మన్నెం కృష్ణ అభినందించారు. హిందీలో పరిచయ, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద పూర్వార్థ, విశారద ఉత్తరార్థ, ప్రవీణ పూర్వార్థ, ప్రవీణ ఉత్తరార్థలో మంచి ప్రతిభ కనబరిచిందన్నారు. విద్యార్థినిని పలువురు అభినందించారు.

24న యాదవుల కార్తిక సమారాధన



మాచర్ల రూరల్: ఈ నెల 24న యాదవుల కార్తిక వన సమారాధనకు పెద్ద ఎత్తున తరలి రావాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, న్యాయవాది గొర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీతారామాలయంలో నిర్వహించిన యాదవుల సమావేశంలో వారు మాట్లాడారు. శివునికి ప్రీతి పాత్రమైన కార్తీకమాసంలో యాదవ కుటుంబ సభ్యులంతా కలసి ఒక్క చోటకు చేరి నిర్వహించుకునే కార్తీక వనభోజనాలకు రాష్ట్రంలోని అన్నీ పార్టీలకు చెందిన యాదవ సంఘ నాయకులను ఆహ్వానించనున్నట్లు వారు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ జింకల నాగేశ్వరరావు, కామనబోయిన నాగరాజు, మురళి, గుండాల శ్రీనివాసరావు, వీరాస్వామి, హరిబాబు, సింగు నాగేశ్వరరావు, సురేష్, సైదులు, రామయ్య, మున్నా రాంబాబు తదితరులున్నారు.

అయోమయంలో విద్యార్థులు..

అదే పద్ధతిలో కూటమి ప్రభుత్వం

- విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోన్న ప్రభుత్వం
- సీబీఎస్ఈ విధానం రద్దు.. ఎస్ఎస్‌సీ పద్ధతిలో టెన్త్ పరీక్షలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



సత్తెనపల్లి: టీడీపీ కూటమి ప్రభుత్వం నాలుగు మాసాల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాలను రద్దు చేయడం లేదా పేర్లు మార్చడం తప్ప చేసిందేమీ లేదంటున్నారు సామాన్యులు సైతం. ప్రత్యేకించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందంటూ విద్యార్థి, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విధానాన్ని రద్దు చేసింది టీడీపీ కూటమి సర్కార్. ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే (సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్) టెన్త్ పరీక్షలు నిర్వహించాలనే సంస్కరణను తీసుకొచ్చింది. దీంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు మాసాల్లో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మళ్లీ మొదటికి రానుందనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా సీబీఎస్ఈ సిలబస్‌ను అభ్యసించిన విద్యార్థులు టెన్త్, ఇంటర్ అనంతరం జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను చాటి కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో సత్తా చాటే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మూడేళ్ల పాటు కష్టనష్టాలకు ఓర్చుకొని సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడిన విద్యార్థులు తాజా ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై విద్యార్థి, ప్రజా సంఘాలతో పాటు తల్లిదండ్రులు సైతం మండిపడుతున్నారు. ఇదేం నిర్ణయం అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ...

సీబీఎస్ఈ విద్యను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు సైతం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చింది. ఈ మేరకు మెలకువలపై అవగాహన పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించారు. ఎన్నో ఇబ్బందులు ఓర్చి శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు సైతం ఉత్సాహంగా ఉన్నారు. అంతా బాగుంది అనుకుంటుండగా గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. గత ప్రభుత్వ నిర్ణయాలను తోసి పుచ్చడమే తమ లక్ష్యం అన్నట్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ తీరు ఉందని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్‌లో సీబీఎస్ఈ పాఠశాలలు ఇవి...

మండలం	పాఠశాల
అచ్చంపేట	కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్
బెల్లంకొండ	కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్
క్రోసూరు	ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్
ముప్పాళ్ళ	కేజీబీవీ
నకరికల్లు	ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్, ఎస్వీవీఆర్ జెడ్పీహెచ్ఎస్
రాజుపాలెం	కేజీబీవీ
సత్తెనపల్లి	ఏపీఎస్‌డబ్ల్యూర్(గర్ల్స్), కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ (సుగాలి కాలనీ, కొమెరపూడి, భృగుబండ)
అమరావతి	ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్
రాజుపాలెం	జెడ్పీహెచ్ఎస్ (గణపవరం)

విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా సీబీఎస్ఈ...

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరంలో సీబీఎస్ఈ విధానాన్ని అమలు చేసింది. ఈ మేరకు పల్నాడు జిల్లాలో 67 పాఠశాలలను ఎంపిక చేయగా సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో 20 పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎనిమిదవ తరగతి నుంచి ప్రారంభించి క్రమంగా పదో తరగతి వరకు కొనసాగించారు అధికారులు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ మేరకు విద్యార్థులు సైతం ఆ దిశగా సన్నద్ధమయ్యారు. అయితే కూటమి ప్రభుత్వం మళ్లీ పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు రాయించాలని నిర్ణయం తీసుకోవడంతో అయోమయంలో పడ్డారు టెన్త్ విద్యార్థులు.

రోడ్లపైనే పారుతున్న మురుగు



పెదకూరపాడు: నిత్యం రద్దీగా ఉండే లగడపాడు గ్రామంలోని గుజ్జర్లపూడి రహదారి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిపై నిత్యం మురుగు నీరు పారుతుండటంతో ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో మురుగు కాలువలో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. చుట్టుపక్కల ప్రజలు వ్యాధుల పాలవుతున్నారు. గ్రామంలోని వీధుల్లో మురుగు కాలువ దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేదు. అధికారులు స్పందించి మురుగు కాలువల పూడికతీత కార్యక్రమాన్ని చేపట్టాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాద మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం వెన్నాదేవి వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎడ్లపాడు మండలం లింగారావుపాలెం గ్రామానికి చెందిన రాయపూడి రోశయ్య (32), కట్టా వీరేంద్ర (17)ల మృతదేహాలకు సోమవారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించటంతో లింగారావుపాలెంలో అంత్యక్రియలకు తరలించారు.

హర హర మహాదేవా..



అచ్చంపేటలోని హరిహర క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సత్తెనపల్లిలోని శివాలయంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- మారుమోగిన శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



పెదమక్కెనలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి



సత్తెనపల్లిలోని శివాలయంలో వెలుగులీనుతున్న కార్తీక దీపాలు

సత్తెనపల్లి: కార్తిక మాసం తొలి సోమవారం కావడంతో శివాలయాలన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు తలస్నానాలు ఆచరించి స్వామిని భక్తితో దర్శించుకున్నారు. అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఈశ్వరుడు అభిషేక ప్రియుడు కావడంతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, క్షీరాభిషేకాలు ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేసిన వారు మహాదేవుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో భక్తులు కిక్కిరిశారు. హరి హర మహాదేవ శంభో శంకర అంటూ శివనామాన్ని స్మరించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక మాస పూజలు

నకరికల్లు: పవిత్ర కార్తిక మాస సోమవారం పురస్కరించుకొని మండలంలోని ప్రముఖ శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. మండలంలోని నర్శింగపాడు గ్రామంలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, చల్లగుండ్లలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, దేచవరం, గుండ్లపల్లి గ్రామాల్లోని మల్లేశ్వరస్వామి ఆలయం, కండ్లకుంట, కుంకలగుంట గ్రామాల్లోని ప్రముఖ ఆలయాలకు తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆయా ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేశారు. స్వామి వారిని, అమ్మవారిని విశేషంగా అలకరించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవార పూజలు

అచ్చంపేట: కార్తిక మాసంలో వచ్చే ప్రతి సోమవారం పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన రోజు. అందులోను మొదటి సోమవారం నాడు భక్తులు వేకువ జాము నుంచే శివ, విష్ణు ఆలయాలకు క్యూ కట్టారు. మండలంలోని పలు శివాలయాలలో కార్తీక సోమవార పూజలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక హరిహర క్షేత్రంలో భక్తులు వేకువ జాము నుంచే ఆలయ ప్రాంగణంలోని ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. ఆలయ పూజారులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. చామర్రు, మాదిపాడు, గింజుపల్లి తదితర గ్రామాలలో భక్తులు కృష్ణా నదిలో కార్తిక స్నానాలు ఆచరించారు. అచ్చంపేటకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వయంభుగా వెలసిన నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్లారు. ఎత్తయిన రెండు పర్వతాల మధ్య స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుడు, జ్యోతిర్లింగాలకు పూజలు చేశారు.

క్రోసూరు మండలంలో...

పీసపాడు (క్రోసూరు): కార్తీక మాసం తొలి సోమవారం ఆలయాల్లో ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని క్రోసూరు, ఊటుకూరు, బయ్యవరం, దొడ్లేరు, ఆవులవారిపాలెం తదితర గ్రామాల్లో కార్తిక మాసం పూజలు నిర్వహించారు. మండలంలోని పీసపాడు గ్రామంలో పార్వతీ సమేత నాగమల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధికంగా పాల్గొన్నారు. పూజారి తుర్లపాటి వెంకటేశ్వరరావు గురుస్వామి పూజలు నిర్వహించారు.

వైభవంగా కార్తిక సోమవార పూజలు

బెల్లంకొండ: కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు, గంగిరెడ్డిపాలెం, వెంకటాయపాలెం గ్రామాలలోని శివాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. ఉదయాన్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసన్నాంజనేయునికి విశేష అభిషేకాలను అర్చకులు నరసింహాచార్యులు, అనంతాచార్యులు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు చేసి, స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. వెంకటాయపాలెంలోని శివాలయంలో సహస్ర దీపార్చనతో శివ లింగాకారంలో దీపాలు వెలిగించారు.



నర్శింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో...



పీసపాడు గ్రామంలో కార్తిక సోమవారం పూజల్లో మహిళలు

ఉల్లాస్‌పై అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలో ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ సొసైటీ) కార్యక్రమంలో భాగంగా వీఓఏలకు, విద్యా వలంటీర్లకు సోమవారం అవగాహన కార్యక్రమం జరిగింది. నవంబర్ 5 నుంచి అన్ని గ్రామాల్లోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో నిరక్షరాస్యులుగా గుర్తించిన వారిని అక్షరాస్యులుగా చేయాల్సి ఉంటుందని ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి తెలిపారు. మండలంలో మొత్తం 460 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. పది మందికి ఒకరు చొప్పున 46 మంది వలంటీర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. గ్రామాల్లో యాక్టివ్‌గా ఉన్న సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిలో పది మందిని గ్రూపుగా చేసి యాక్టివ్ సభ్యురాలు లేదా గ్రామ సమాఖ్య అసిస్టెంట్ వలంటీర్‌గా ఆరు నెలలు వారికి వయోజన విద్యా కేంద్రం సహకారంతో ఎనిమిది అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షకులకు మార్చి నెలలో రాత పరీక్ష నిర్వహించి ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్ అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మున్ని, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ

పట్టభద్రులు త్వరితగతిన

ఓటు నమోదు చేసుకోవాలి

- రేపటి వరకే దరఖాస్తుకు అవకాశం
- సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



మాట్లాడుతున్న తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి

సత్తెనపల్లి: పట్టభద్రులంతా త్వరితగతిన ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం సత్తెనపల్లి రూరల్ మండల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ లోపు అర్హులైన పట్టభద్రులందరి చేత ఓటు హక్కుకు దరఖాస్తులు చేయించాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సత్తెనపల్లి మండలంలో ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 1,111 మంది, 428 మంది ఆఫ్‌లైన్ ద్వారా మొత్తం 1,539 మంది దరఖాస్తు చేశారన్నారు. అత్యధికంగా గుడిపూడి గ్రామంలో ఆన్‌లైన్ ద్వారా 184 మంది దరఖాస్తు చేస్తే, ఆఫ్‌లైన్ ద్వారా అత్యధికంగా రెంటపాళ్ల గ్రామం నుంచి 88 మంది దరఖాస్తు చేశారన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోసుబాబు, సత్తెనపల్లి రూరల్ మండలంలోని బీఎల్వోలు తదితరులు ఉన్నారు.

సత్తెనపల్లి మండలంలో గ్రామాల వారీగా వచ్చిన దరఖాస్తులు...

గ్రామం	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం	గ్రామం	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
గుడిపూడి	184	27	211	పెదమక్కెన	45	33	78
నందిగామ	117	33	150	భీమవరం	49	23	72
కొమెరపూడి	126	02	128	పాకాలపాడు	45	27	72
రెంటపాళ్ల	30	88	118	భట్లూరు	70	01	71
పణిదం	87	26	113	ధూళ్ళిపాళ్ల	55	05	60
కట్టమూరు	39	54	93	కంకణాలపల్లి	33	20	53
కంటెపూడి	64	17	81	అబ్బూరు	34	08	42
భృగుబండ	78	01	79	కందులవారిపాలెం	07	17	24
				గోరంట్ల	23	-	23
లక్కరాజు గార్లపాడు	32	46	78	మొత్తం	1,111	428	1,539

■ అమరావతి: మండల పరిధిలోని నెమలికల్లు గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసులు 8 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నెమలికల్లులో బెల్టుషాపు నిర్వహిస్తున్న ఎస్‌కే జాన్‌సైదా నుంచి ఏపీకి చెందిన 8 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. జాన్‌సైదాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్వింటా పత్తిని రూ.10 వేలకు కొనుగోలు చేయాలి

రైతు సంఘం నాయకులు

పెదకూరపాడు: క్వింటా పత్తి రూ.10 వేలకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దర్శి శేషారావు అన్నారు. పెదకూరపాడు తహసీల్దార్ దానియల్‌ను సోమవారం రైతులు, దర్శి శేషారావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ సీసీఐ పత్తి కొనుగోలును వెంటనే ప్రారంభించాలన్నారు. తేమ శాతం నిబంధనలు సడలించి రైతు వద్ద ఉన్న పత్తిని క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,521 నుంచి రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని దిగుబడి పూర్తిగా పడిపోయిందన్నారు. కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందలేదని, వారికి వ్యవసాయ శాఖ అధికారి ధ్రువీకరణ పత్రంతో పత్తి కొనుగోలుకు సహకరించాలని కోరారు. తహసీల్దారును కలిసిన వారిలో ప్రతినిధులు ఏ వెంకట కృష్ణారావు, ఎం.మస్తానావు, షేక్ జానీ బాషా, ఎం.నరసింహారావు, నరేష్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ దానియేలుకు వినతి పత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు